క్లుప్తంగా

కాలి నడకన అప్పన్న ఆలయానికి..



డుంబ్రిగుడ: మండలం కేంద్రం డుంబ్రిగుడకు చెందిన వేంకటేశ్వర స్వామి భక్తులు కిల్లోగుడ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి సింహాచలంలో వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకునేందుకు మంగళవారం కాలినడకన బయలుదేరారు. ఈ సందర్భంగా పాదయాత్ర చేస్తున్న భక్తులు శెట్టి రాజారావు, పల్లెడి రాజు, అప్పన్న, కొండబాబు, రాము మాట్లాడుతూ రెండు రోజుల పాటు తమ యాత్ర సాగుతుందని చెప్పారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



సత్యనారాయణ మృతదేహం

అడ్డతీగల: మండలంలో దాకోడుకి చెందిన పాడుగు సత్యనారాయణ(25) అనే యువకుడు మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు.ఎలక్ట్రికల్ పనులు చేసే ఈ యవకుడు వీధిలైట్లు వేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు చెబుతున్నారు. విద్యుత్ స్తంభంపై ఎక్కి పనిచేస్తుండగా పక్క గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసే 11కేవీ లైన్ వైర్లు ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుత్ షాక్‌కి గురై అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు,గ్రామస్తులు అతనిని హుటాహుటిన సమీపంలోని కొయ్యూరు మండలం రాజేంద్ర పాలెం పీహెచ్‌సీకి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ సత్యనారాయణ మృతి చెందాడు. మృతునికి భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు. దుశ్చర్తి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టర్ దృష్టికి సన్‌రైజ్ వ్యూపాయింట్ భూ సమస్య



వినతి పత్రం ఇచ్చి సమస్య వివరిస్తున్న ఎంపీపీ ఉషారాణి, సర్పంచ్ జ్యోతి

అరకులోయ రూరల్: మండలంలో మాడగడ సన్‌రైజ్ వ్యూ పాయింట్ భూ సమస్యను మంగళవారం కలెక్టర్ దృష్టికి ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, సర్పంచ్ జ్యోతి తీసుకెళ్లారు. అరకులోయ పర్యటనకు వచ్చిన కలెక్టర్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ వ్యూపాయింట్ అటవీశాఖ పరిధిలో ఉండడంతో అభివృద్ధి పనులు, రహదారుల నిర్మాణానికి సంబంధిత అధికారులు అంగీకరించడం లేదని కలెక్టర్‌కు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించి, పనులు జరిగేలా చూడాలని వారు కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు ఉషారాణి, జ్యోతి తెలిపారు.

హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మత్స్యరాజు

జి.మాడుగుల: దేవాలయాలను రక్షించుకుందాం కార్యక్రమంలో భాగంగా విశ్వ హిందూపరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎస్ఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ మత్స్యరాస మత్స్యరాజు, వీహెచ్‌పీ జిల్లా ధర్మప్రసార ప్రముఖ్ రీమెలి అప్పలరాజు కోరారు. స్థానిక రామాలయం ఆవరణలో మంగళవారం హైందవ శంఖారావం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలో విజయవాడ కార్యక్రమానికి భారీ సంఖ్యలో హాజరు కావాలన్నారు. వీహెచ్‌పీ మండల ఉపాధ్యక్షుడు గంగాధరరావు, నాయకులు బాలరాజు, భాస్కరరావు పాల్గొన్నారు.

రేపు గ్రామ వలంటీర్ల జిల్లా సదస్సు

రంపచోడవరం: గ్రామ వలంటీర్ల సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో 14న రంపచోడవరంలో నిర్వహించనున్న జిల్లా సదస్సును విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు మట్ట వాణిశ్రీ కోరారు. గ్రామ వలంటీర్లను విధుల్లోకి తీసుకుని బకాయి వేతనాలు చెల్లించాలని, ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు వేతనం రూ. 10వేలు చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సభకు పెద్ద సంఖ్యలో వలంటీర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తుస్సుమన్న 'పంచాయతీ'

- పక్కదారిపట్టిన ఈవోపీఆర్డీ బదిలీల విచారణ
- అల్లూరి,అనకాపల్లి జిల్లాల బదిలీలపై ఆరోపణలు
- విశాఖ జిల్లాకే విచారణ పరిమితం
- నివేదికను కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు సమర్పించిన జెడ్పీ సీఈవో



జిల్లా పరిషత్ భవనం

మహారాణిపేట(విశాఖ): మోకాలికి దెబ్బతగిలితే బోడి గుండుకు కట్టు వేసినట్లు ఉంది పంచాయతీ రాజ్ శాఖ అధికారుల తీరు. అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో జరిగిన బదిలీల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తే.. వాటిని మినహాయించి విశాఖ జిల్లాలో బదిలీలపై మాత్రమే విచారణ చేయించడం విడ్డూరంగా ఉంది. అసలు దొంగలకు కొమ్ముకాయడానికి కూటమి నేతల నుంచి ఉన్నతాధికారుల వరకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో తీవ్ర దుమారం రేపిన ఈవోపీఆర్డీల బదిలీల వ్యవహారంలో విచారణను చివరకు తుస్సుమనిపించారు. ఆరోపణలు ఉన్న జిల్లాల్లో విచారణ చేయకపోవడం పట్ల పంచాయతీరాజ్ ఉద్యోగులు విస్తుపోతున్నారు. ఈ బదిలీల్లో అక్రమాలు జరిగాయని ఉద్యోగులే స్వయంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ.. విచారణను పక్కదారి పట్టించడం ఇప్పుడు పంచాయతీరాజ్ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.

అనకాపల్లి కేంద్రంగా అక్రమాలు

అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఈవోపీఆర్డీ అధికారుల బదిలీల వ్యవహారంపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. కొంతమంది పంచాయతీ అధికారులు, సిబ్బంది.. నచ్చిన వారిని అందలం ఎక్కించారన్న విమర్శలు వినిపించాయి. ఇందులో భారీగా డబ్బులు చేతులు మారినట్టు స్వయంగా ఉద్యోగులే బహిరంగంగా చెబుతున్నారు. ఈ అక్రమ బదిలీలు కారణంగా సుదీర్ఘకాలంగా అల్లూరి జిల్లాలో పనిచేస్తున్న వారు ఇప్పటికీ మైదాన ప్రాంతాలకు రాలేకపోయారు. మైదాన ప్రాంతాల్లో ఉన్న వారు గిరిజన ప్రాంతాలకు వెళ్లకుండా తమ పలుకుబడిని ఉపయోగించి స్థానికంగానే పోస్టింగ్‌లు సంపాదించుకున్నారు. దీనిపై కొంత మంది ఉద్యోగులు విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ ఈ బదిలీల వ్యవహారంపై జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తితో విచారణకు ఆదేశించారు. దీని ప్రకారం సీఈవో అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పోస్టింగ్‌ల వివరాలు కోరినప్పటికీ.. సంబంధిత అధికారుల నుంచి స్పందన లేకపోవడం విశేషం. విచారణ హాజరుకావాలని రెండు సార్లు అనకాపల్లి డీపీవో, అల్లూరి జిల్లా డీపీవోలకు చెప్పినా దుమ్మా కొట్టారు. బదిలీల జాబితాను సైతం విచారణాధికారికి ఇవ్వలేదన్న వాదనలు ఉన్నాయి. ఈ దశలో విచారణ నుంచి అనకాపల్లి, అల్లూరి జిల్లాలను మినహాయించారు. ఆయా జిల్లాల్లో జరిగిన బదిలీలపైనే ఆరోపణలు రాగా.. వాటిని తప్పించడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం విశాఖ జిల్లాలో మాత్రమే విచారణ చేపట్టేలా ఆదేశాలిచ్చారు. ఇందుకు తగ్గట్టుగానే జెడ్పీ సీఈవో విశాఖ జిల్లాలో విచారణ పూర్తి చేసి కలెక్టర్‌కు నివేదికను సమర్పించారు.

ప్రజా ప్రతినిధుల హస్తం

జెడ్పీ సీఈవోను రెండు జిల్లాల విచారణ నుంచి తప్పించడంలో కొంత మంది ప్రజాప్రతినిధులు కీలకపాత్ర పోషించినట్టు తెలిసింది. సమాచార సేకరణలో వేగంగా ఉండడం, బదిలీలైన వారి వివరాలు, బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు ఇవ్వాలని జెడ్పీ సీఈవో అడగడంతో కొంత మంది అధికారుల్లో భయం నెలకొంది. ఈ విచారణకు పంచాయతీ అధికారులు సహకరించకపోవడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. దీంతో కూటమి ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగి తమ వారిని కాపాడుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేశారు. అందువల్లే అనకాపల్లి, అల్లూరి జిల్లాలను విచారణ నుంచి మినహాయించారు. దీంతో మొత్తం విచారణ నీరు కారిపోయింది.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు కీలకం



శిక్షణకు హాజరైన సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, వెలుగు వీవోఏలతో జీకేవీధిమండల అధికారులు

కొయ్యూరు: పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు కీలకంగా మారుతాయని ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పంచాయతీ ప్రణాళికల అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నిశాఖల సమన్వయంతో అవసరమైన పనులకు సంబంధించి ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు.

ముంచంగిపుట్టు: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో శ్రీసాయిహర్ష అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీవో చిన్నన్న, పంచాయతీ కార్యదర్శులు సత్యరంజన్,ప్రవీణ్‌కుమార్‌లు అవగాహన కల్పించారు.

గూడెంకొత్తవీధి: ప్రత్యేక ప్రణాళికతోనే గిరిజన గ్రామాల అభివృద్ధి సాధ్యమని గూడెంకొత్తవీధి ఇన్‌చార్జి ఎంపీడీవో ఇమ్మానుయేల్ అన్నారు. గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళిపై మంగళవారం మండల పరిషత్‌కార్యాలయంలో వెలుగు వీవోఏలు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రణాళికల తయారీపై పలు సూచనలు చేశారు. ఈవోపీఆర్డీ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

67 మందికి వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ నాగార్జున

రాజవొమ్మంగి: అమీనాబాద్‌లో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో 67 మందికి వైద్యసేవలు అందజేసినట్టు జడ్డంగి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నాగార్జున తెలిపారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక పరీక్షలు చేసినట్టు చెప్పారు. ఏఎన్ఎంలు మహేశ్వరి, వరలక్ష్మి, ఎంపీహెచ్‌వో లక్ష్మణరావు, హెల్త్‌అసిస్టెంట్లు గోవింద రాజు, పద్దరాజు, 104 డీఈవో శ్రీనివాస్, పైలెట్ కనకరాజు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా బుజ్జి



బుజ్జిబాబును అభినందిస్తున్న చిన సుబ్బారావు

రాజవొమ్మంగి : ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా రాజవొమ్మంగికి చెందిన మోర్త బుజ్జి బాబు ఎన్నికయ్యారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో మంగళవారం ఎంఆర్‌పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎంఆర్‌పీఎస్ ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల అధ్యక్షుడు ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో సుబ్బారావు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ గత మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ ఫలాలను మాదిగ జాతికి అందించేందుకు ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. జిల్లా కార్యదర్శిగా నిడమర్తి చిన్నబాబు, మండల కన్వీనర్‌గా పెద నూకరాజును ఎన్నుకొన్నారు. నూకరాజు, జీవరత్నం, కిరణ్, తాతారావు, లోవరాజు, శ్రీను పాల్గొన్నారు.

జి.మాడుగులలో కుండపోత

జి.మాడుగుల: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కుండపోతగా వర్షం కురిసింది. రోడ్లు, వీధులు, పంటపొలాలు జలమయమయ్యాయి. సంతబయలులో జరిగిన వారపుసంతకు ఆటంకం కలిగింది. సరుకులు తడిసి ముద్దయ్యాయి. వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు.

వయోజన విద్యపై శిక్షణ

కూనవరం: ఉల్లాస్ అడల్ట్ ఎడ్యుకేషన్ (వయోజన విద్య) ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సమాఖ్య కార్యదర్శి (వీవోఏ), వలంటరీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఆర్.విజయ, వెలుగు ఏపీఎం కె.శ్యాంబాబు, ఈవోఆర్డీ ఆంజనేయ ప్రసాద్, సీడీపీవో నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: వయోజన విద్యను పూర్తిస్థాయిలో అమలు చేయడం ద్వారా అక్షరాస్యత పెంపొందుతుందని గూడెంకొత్తవీధి ఇన్‌చార్జి ఎంపీడీవో ఇమ్మానుయేల్ అన్నారు. మంగళవారం మండల పరిషత్‌కార్యాలయంలో ఉల్లాస్‌కార్యక్రమం అమలు తీరుపై వెలుగు వీవోఏలకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్డీ పాపారావు పాల్గొన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



కూనవరంలో కలశాలతో నగర సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

కూనవరం: కార్తీక మాసం రెండవ సోమ, మంగళవారాలలో మండల కేంద్రంలోని శబరి దుర్గాంబ సంగమేశ్వర స్వామి వారి ఆలయం, కుమారస్వామి గుట్టపై కొలువుదీరిన శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వా మి వారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. భక్తులు వేకువ జాము నుంచే శబరి, గోదావరి సంగమ తీరంలో పుణ్యస్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం కలశ పూజ నిర్వహించారు. అనంతరం కలశాలతో నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు.

ఆశ్రమపాఠశాలలో ఘనంగా జల్ ఉత్సవ్

గంగవరం : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో జల్‌ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉపాధి ఏపీవో ప్రకాశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంపీడీవో పీజీ రామకృష్ణ బాలికలకు జల్‌ఉత్సవం ముఖ్యఉద్దేశాన్ని వివరించారు. మండలంలో అన్ని చోట్ల బోరుబావుల్లో నీటిని సేకరించి పరీక్షలకు పంపినట్టు తెలిపారు. సురక్షితమైన నీటిని సేవిస్తే రోగాలకు దూరంగా ఉండగలమన్నారు. హెచ్ఎం వరలక్ష్మి, ఇంజినీర్ సతీష్, గ్రామసచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి విలువ తెలుసుకోవాలి

జి.మాడుగుల: మండలంలో నుర్మతి గ్రామ పంచాయతీ కేంద్రం, జి.మాడుగుల ఎంఎంఎస్ భవనంలో మంగళవారం జల్‌ఉత్సవ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు అవగాహన కల్పించారు. జిల్లా కో–ఆర్డినేటర్లు పుల్లయ్య, ఆనంద్ మాట్లాడుతూ నీటి విలువ తెలుసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బాబూరావు పడాల్, సీడీపీవో సువర్ణమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్ కుమార్ పాల్గొన్నారు.


గంజాయితో జీవితాలు నాశనం



అడ్డతీగల వారపుసంతలో మాట్లాడుతున్న సీఐ నరసింహమూర్తి

అడ్డతీగల: గంజాయి వల్ల తలెత్తే అనర్థాలను యువత గుర్తించి, దానికి దూరంగా ఉండాలని అడ్డతీగల సీఐ నరసింహమూర్తి అన్నారు. అడ్డతీగలలో మంగళవారం జరిగిన వారపుసంతలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంజాయి రవాణా, వినియోగం వంటి చర్యలకు పాల్పడరాదన్నారు.గంజాయికి అలవాటుపడితే ఆరోగ్యం పాడవడంతో పాటు ఆర్థికంగా చితికిపోతాయన్నారు. ఎస్ఐ వినోద్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



ఎంపీపీ ఈశ్వరిని కలిసిన పంచాయతీ కార్యదర్శులు

డుంబ్రిగుడ: పంచాయతీ కార్యదర్శులు అంకిత భావంతో పనిచేసి, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ బాకా ఈశ్వరి తెలిపారు. మండలంలోనని కొర్ర, కించుమండ, గసభ, సొవ్వా, కండ్రుమ్, అరమ, కొల్లాపుట్టు తదితర పంచాయతీల్లో నూతనంగా నియమితులైన కార్యదర్శులు మంగళవారం ఎంపీపీ బాకా ఈశ్వరిని ఆమె గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు యల సుధా, గురుమూర్తి, విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బాక సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కును వినియోగించుకోవాలి

ముంచంగిపుట్టు: ఓటు హక్కు మాదిరిగానే సమాచార హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఏవో ఎ.శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ప్రజా ప్రతినిధులకు, సచివాలయ సిబ్బందికి సమాచార హక్కు చట్టం పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం గురించి క్షేత్రస్థాయిలో సామాన్య ప్రజలకు తెలియజేశాయలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీసాయిహర్ష, ఏవో శ్రీనివాసబాబు,ఈవోపీఆర్డీవో చిన్నన్న,సర్పంచులు,ఎంపీటీసీలు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'కృషి తరంగ్ సేవ'ను సద్వినియోగం చేసుకోవాలి



కాఫీ రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి అరుణకుమారి

గూడెంకొత్తవీధి: కాఫీ రైతుల ప్రయోజనం కోసం కేంద్ర కాఫీబోర్డు అమలు చేస్తున్న కృషితరంగ సేవ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఐటీడీఏ కాఫీ విభాగం ఉద్యానవన శాఖ అధికారి అరుణకుమారి అన్నారు. దామనాపల్లిలో మంగళవారం కాఫీ రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.అవసరమైన సాంకేతిక సలహాలను కేంద్రకాఫీబోర్డు అందిస్తుందన్నారు. దామనాపల్లి సర్పంచ్ కుందరి రామకృష్ణ మాట్లాడుతూ కాఫీ రైతులకు మేలు చేసేందుకు ఐటీడీఏ, జీసీసీ, కాఫీబోర్డు సంయుక్తంగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చంటిబాబు, గ్రామపెద్ద పల్లంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణ



వర్తక సంఘ నాయకులతో మాట్లాడుతున్న సీఐ వినోద్‌బాబు

చింతపల్లి: శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని సీఐ వినోద్‌బాబు అన్నారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను స్థానిక వర్తక సంఘ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం నాయకులు పెడిరెడ్ల బేతాలుడు,మాదాబత్తుల వెంకటరమణ,బేతా రమణ,శ్రీనివాసరావు, దూనబోయిన రమణ తదితరులు పాల్గొన్నారు.

సంక్రమిత వ్యాధులపై అవగాహన అవసరం

చింతపల్లి: సంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మండల ఎంవోటీసీ డాక్టర్ లక్ష్మీకాంత్ అన్నారు.మంగళవారం లోతుగడ్డ పీహెచ్‌సీలో చింతపల్లి, జీకే వీధి మండలాల ఎంఎల్‌హెచ్‌పీలకు సంక్రమిత వ్యాధులపై శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగామాట్లాడుతూ సంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించవలసిన బాధ్యత ఎంఎల్‌హెచ్‌పీపై ఉందన్నారు. పాడేరు డీపీపీ శేషు,డీపీఎస్ రామరాజు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

డుంబ్రిగుడ: వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చే సలహాలు, సూచనలు పాటించి, రైతులు అధిక దిగుబడులు సాధించాలని కండ్రుమ్ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కె.హరి తెలిపారు. మండలంలోని కండ్రుమ్ పంచాయతీలో వ్యవసాయ శాఖ అధికారి నీలవేణి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో హరి మాట్లాడుతూ అధిక దిగుబడులపై దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ ఉద్యోగి పురుషోత్తం, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

పంట బీమాతో రైతులకు ఆర్థిక ఆసరా

ముంచంగిపుట్టు: పంట బీమాతో రైతులకు ఆర్థిక ఆసరా లభిస్తుందని మండల వ్యవసాయశాఖాధికారి ఎం.శ్రీనివాసబాబు తెలిపారు. పెదగూడ పంచాయతీ సారథి,కించాయిపుట్టు పంచాయతీ ధారపల్లి గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి, పంట బీమాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ,పశుసంవర్థక శాఖ,ఉద్యానవన శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపిక



రాహుల్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బి. రాహుల్ జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ తెలిపారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ నిర్వహించిన పోటీల్లో రాహుల్ గోల్డ్ మెడల్ సాధించినట్టు చెప్పారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లో జరగనున్న ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ జూడో పోటీల్లో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ తరపున ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన రాహుల్‌ను ప్రిన్సిపాల్ వసుధ, వైస్ ప్రిన్సిపాల్ డి.రవికుమార్, పీడీ కె. ప్రభాకర్, అధ్యాపకులు అభినందించారు.

బస్కీలో ప్రబలిన వ్యాధులు



ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శిస్తున్న బాలదేవ్

అరకులోయ రూరల్: బస్కీ పంచాయతీ కేంద్రంతో పాటు జాకరవలసలో వ్యాధులు ప్రబలి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ తెలిపారు. గ్రామంలో వెంటనే వైద్యశిబిరం నిర్వహించాలని ఆయన కోరారు. గ్రామంలో పలువురు చిన్నారులు కళ్ల కలకలు, జ్వరం,దగ్గు, వాంతులతో బాధపడుతున్నారని తెలిపారు. కొంతమంది ఏరియా ఆస్పత్రిలో చికిత్సపొందుతుండగా, మరి కొందరు గ్రామంలో ఉన్నారని చెప్పారు. ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని ఆయన పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించాలని కోరారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ప్రజాపోరు



ముంచంగిపుట్టులో ప్రజాపోరును ప్రారంభిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ముంచంగిపుట్టు: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాపోరు నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స తెలిపారు.మండల కేంద్రంలో సీపీఎం ప్రజాపోరు కార్యక్రమాన్ని మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నవంబర్ 8వ తేదీ నుంచి 14వరకు ప్రజాపోరు ద్వారా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు త్రినాథ్,భీమరాజు,రాందాసు,నారాయణ,గణపతి,లైకోన్,శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అన్ని వర్గాల ప్రజలు పోరాటం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రామారావు తెలిపారు. మండలంలో బస్కీ పంచాయతీ పరిధిలో ఉన్న వివిధ గ్రామాల్లో మంగళవారం పర్యటించి, మాట్లాడారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలందరూ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు దశరథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.